క్లుప్తంగా

రేపటి నుంచి నగరపాలక సంస్థలో ఈఎస్ఐ క్యాంపు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులకు ఈఎస్ఐ శిబిరాన్ని ఈ నెల 23 నుంచి 25 వరకు నిర్వహించనున్నట్లు కమిషనర్ కీర్తి చేకూరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులంతా కార్డుల్ని అప్డేట్ చేసుకోవాలని ఆమె సూచించారు.

కాకుమానువారితోటలో జీజీహెచ్ ఓపీ సేవలకు సన్నాహాలు

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రికి స్థానిక కాకుమానువారితోటలో కేటాయించిన ఆరు ఎకరాల స్థలాన్ని సోమవారం సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చర్మ, డెంటల్, మానసిక విభాగాలకు జీజీహెచ్‌లో సరిపడా స్థలం లేక పోవడంతో ఆయా విభాగాలకు కాకుమానవారితోటలో భవనాల్ని నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇక్కడే ఓపీ సేవలను ప్రారంభించాలని నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. భవనం పూర్తయితే పేద ప్రజలకు అందుబాటులో ఉంటుందని చెప్పారు. స్థలం కబ్జా కాకుండా రూ. 2 కోట్లతో కాంపౌండ్ వాల్ నిర్మించాలని డీఎంఈకి లేఖ రాశామని, అందుకు ఇంజినీరింగ్ శాఖ అధికారులు కూడా ప్రతిపాదనలు ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ డి.ఎస్.ఎస్.శ్రీనివాస ప్రసాద్, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకటసతీష్ కుమార్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



లక్ష్మీపురం: ఇన్నర్ రింగ్ రోడ్డు రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. మృతుడి వయస్సు 50 దాకా ఉంటుంది. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని చుట్టుపక్కల వారిని విచారించినా, వివరాలు తెలియలేదు. గుర్తు తెలియని రైలు ఢీకొని ఉంటుందని భావిస్తున్నారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని ప్రభుత్వ సమగ్రాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం పంపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు గుంటూరు రైల్వే జీఆర్పీ సీఐ గంగా వెంకటేశ్వర్లు ఫోన్ నంబర్లు 9440627546, 0863–2220753లను సంప్రదించాలని సూచించారు.

ఇంట్లో చోరీ

గుంటూరు ఈస్ట్: ఇంట్లో చోరీపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. యతిరాజుల కాలనీ ఐదో లైనులో నివాసం ఉండే మేడసాని అంజమ్మ కుటుంబ సభ్యులతో కలసి ఈనెల 19న ఊరెళ్లి, తిరిగి 20న ఇంటికి చేరుకుంది. తాళాలు పగులగొట్టి ఉండటం గమనించి లోపలకు వెళ్లి పరిశీలించగా, బీరువాలోని రూ. లక్ష నగదు, రెండు బంగారం దిద్దులతో పాటు పలు గృహోపకరణాలు చోరికి గురైనట్లు గుర్తించింది. ఈ మేరకు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆయుర్వేద వైద్యం ప్రాచీనమైనది



వైద్యులతో మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు

గుంటూరు రూరల్: గుంటూరు రూరల్: ఆయుర్వేదం భారతదేశ ప్రాచీన వైద్యమని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. సోమవారం నగర శివారులోని ఇన్నర్ రింగ్ రోడ్డులో ఉన్న ఆయుర్వేద సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 100 పడకలతో వైద్యశాలను ఏర్పాటు చేసిన ఆయుర్వేద వైద్య అభివృద్ధికి కృషిచేస్తున్న హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లును అభినందించారు. దీర్ఘకాలిక వ్యాధులైన పక్షవాతం, కీళ్ళనొప్పులు, చర్మవ్యాధులు, నరముల వ్యాధులు తదితర వైద్య సేవలు ఆసుపత్రిలో అందిస్తున్నామని వైద్యులు మాజీ ఉప రాష్ట్రపతికి వివరించారు. ఈ కార్యక్రమంలో భాష్యం రామకృష్ణ, చరణ్‌సాయి, కరుణాకర్, డాక్టర్ జె.ధనలక్ష్మి, డాక్టర్ జి.సాయిగౌతమి, డాక్టర్ ఎల్.మౌనిక, డాక్టర్ వి.సుష్మిత, డాక్టర్ హరికృష్ణ, డాక్టర్ పి.భానుకళ్యాప్, మేనేజర్ మల్లేశ్వరి పాల్గొన్నారు.

గుండెపోటుతో యార్డులో కార్మికుడి మృతి

గుంటూరు రూరల్: గుండెపోటుతో కార్మికుడు మృతి చెందిన ఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు.. పల్నాడు జిల్లా ముప్పాళ్ళ మండలం ఇరుకుపాలెం గ్రామానికి చెందిన బత్తుల కోటేశ్వరరావు (50) మిర్చి యార్డులో కార్మికుడుగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం యార్డులో పనికి వచ్చాడు. అనంతరం పని చేస్తూ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. స్థానికులు గమనించి, అతనిని ఆసుపత్రికి తరలించేలోగా మృతి చెందాడు. సమాచారం తెలిసిన నల్లపాడు పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని, పరిశీలించారు. కేసునమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ప్రై'వేటు'తో ప్రయాణికులు విలవిల

- నగరంలో ప్రయాణికులకు కరువైన ఆర్టీసీ సిటీ బస్సులు
- వేలల్లో తిరుగుతున్న ప్రైవేటు వాహనాలు
- ఆదాయ మార్గాలపై దృష్టి సారించని ఆర్టీసీ
- పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా సిటీ సర్వీసుల ఏర్పాటులో విఫలం
- కొరవడిన సరైన ప్రణాళిక, అధికారుల పర్యవేక్షణ



నగరంలో తిరుగుతున్న ప్రైవేటు సర్వీసులు, ఆటోలు

పాత గుంటూరు: శరవేగంగా విస్తరిస్తున్న గుంటూరు నగరంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా సిటీ బస్సుల్ని ప్రవేశపెట్టి ఆదాయాన్ని పెంచుకునే మార్గాల వైపు ఆర్టీసీ దృష్టి సారించడం లేదు. నగరం నలుమూలలా సుమారు 20 కిలోమీటర్ల వరకు విస్తరించింది. శివారుల్లో నూతన కాలనీలు వెలిశాయి. ఇళ్ల నిర్మాణాలు ఊపందుకోవడంతో పాటు జనాభా పెరిగింది. అయితే, శివారు ప్రాంతాల ప్రజలు సరైన రవాణా వ్యవస్థ లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. ఆర్టీసీ సిటీ సర్వీసుల్ని ప్రవేశపెట్టి ఆదాయాన్ని సమకూర్చుకునే అవకాశాలున్నప్పటికీ ఆ దిశగా అడుగులు వేయడం లేదు.

ఉన్నతాధికారి నిర్ణయంతో సిటీ సర్వీసుల రద్దు ?

నగరంలో కొన్నేళ్ల కిందట పేరేచర్ల, నల్లపాడు, చుట్టుగుంట, ఆటోనగర్, పెద పలకలూరు, గుజ్జనగుండ్ల, కొత్తపేట, అరండల్‌పేట తదితర ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులను నడిపింది. చార్జీలు రూ. 10, రూ.15, రూ. 20గా ఉండేవి. సరైన ప్రణాళిక, పర్యవేక్షణ లోపం వల్ల కొన్ని నెలలకే నష్టాలు వస్తున్నాయనే కారణంతో అప్పట్లో ఓ ఉన్నతాధికారి తీసుకున్న నిర్ణయంతో రద్దు చేసినట్లు సమాచారం. ఆ తరువాత సిటీ సర్వీసులను నడపడంపై ఆర్టీసీ దృష్టి సారించలేదు. దీంతో ప్రయాణికులు పూర్తిగా ప్రైవేటు వాహనాలపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది.

ఆటోలు, ప్రైవేటు బస్సులదే హవా

ప్రస్తుతం నగరంలో 5,000 పైగా ఆటోలు, 20కు పైగా ప్రైవేటు సిటీ బస్సులు యథేచ్ఛగా తిరుగుతూ ఆదాయాన్ని సమకూర్చుకుంటున్నాయి. అయితే, ఈ విషయంలో ఆర్టీసీ విఫలమవుతుందనే విమర్శలు ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి. విద్యార్థులు, ఉద్యోగులు, పనుల నిమిత్తం నగరానికి వచ్చే వారు, వెళ్లేవారు ప్రైవేటు సిటీ బస్సులు, ఆటోల్ని ఆశ్రయిస్తున్నారు. దూరాన్ని, సమయాన్ని బట్టి అధికంగా వసూలు చేస్తుండడంతో వీరంతా ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యామ్నాయం లేక అడిగినంత చెల్లించి ప్రయాణిస్తున్నారు. బస్టాండ్ నుంచి శివారు కాలనీలకు ఆర్టీసీ సిటీ సర్వీసుల్ని ప్రవేశపెడితే బాగుంటుందని, సురక్షిత ప్రయాణంతో పాటు తక్కువ చార్జీ చెల్లించి గమ్యస్థానాలకు చేరుకోవచ్చని నగర ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

ఆర్టీసీ సిటీ బస్సులు ప్రవేశపెట్టాలి



నగరంలో సిటీ బస్సులు లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఆటోలు, ప్రైవేటు సిటీ బస్సుల్ని ఆశ్రయించాల్సి వస్తోంది. ప్రత్యామ్నాయం లేదు. ఆటోవాలాలు కూడా ప్రయాణాన్ని బట్టి అధికంగా వసూలు చేస్తున్నారు. రాత్రి వేళల్లో ఎక్కువగా డిమాండ్ చేస్తున్నారు. నగర జనాభా పెరగడంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి ప్రజల రాకపోకలు పెరిగాయి. ఆర్టీసీ సిటీ సర్వీసుల్ని పునరుద్ధరిస్తే తక్కువ చార్జీతో సురక్షిత ప్రయాణం చేయవచ్చు.

– షేక్ జిలాని, నగరవాసి

సిటీ బస్సుల ఏర్పాటుకు చర్యలు



నగరంలో ప్రయాణికుల సౌకర్యార్థం సిటీ బస్సుల్ని నడిపే విధంగా చర్యలు చేపడతాం. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తాం.

–రవికాంత్, జిల్లా ప్రజా రవాణా అధికారి

'స్పందన' ఫిర్యాదులకు నిర్దేశిత గడువులోగా పరిష్కారం

అధికారులకు అదనపు కమిషనర్ పెద్ది రోజా ఆదేశం



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ పెద్ది రోజా, డెప్యూటీ కమిషనర్లు

నెహ్రూనగర్: స్పందనలో ప్రజల నుంచి అందే ఫిర్యాదుల్ని నిర్దేశిత గడువులో పరిష్కారమయ్యేలా విభాగాధిపతులే నేరుగా పరిశీలించి, పరిష్కరించాలని పెద్ది రోజా ఆదేశించారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ హాలులో సోమవారం స్పందన నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ ప్రజల నుంచి జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అందే ఫిర్యాదుల్ని బాధ్యతతో పరిష్కరించాలని, విభాగాల వారీగా అర్జీల పరిష్కారానికి ప్రత్యేక సిబ్బందిని కేటాయించుకోవాలని ఆదేశించారు. ఫిర్యాదులకు ఇచ్చే ఎండార్స్‌మెంట్‌ను ఆయా విభాగాధిపతులు పరిశీలించాలని, పరిష్కారం అనంతరం వారికి సమాచారం తెలియజేయాలని చెప్పారు. సమస్య పరిష్కారానికి ముందు, తర్వాత ఫొటోలు జత చేయాలని సూచించారు. సచివాలయ కార్యదర్శులు విభాగాల వారీగా తమ సచివాలయం పరిధిలో ప్రజల సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉండాలని తెలిపారు. వార్డు సచివాలయాల్లో ప్రతి రోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు జరిగే స్పందనలో కార్యదర్శులందరూ అందుబాటులో ఉండాలని ఆమె ఆదేశించారు. సోమవారం నిర్వహించిన స్పందనలో 25 ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఇందులో పట్టణ ప్రణాళిక విభాగానికి 7, ఇంజినీరింగ్ విభాగానికి 11, రెవెన్యూ విభాగానికి 5, ప్రజారోగ్య విభాగానికి 2 చొప్పున ఫిర్యాదులు అందాయని వివరించారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, సీహెచ్.శ్రీనివాస్, డి.రవీంద్ర, ఎస్ఈ భాస్కర్, సిటీప్లానర్ ప్రదీప్ కుమార్, బయాలజిస్ట్ మధుసూదన్, ఉపా సెల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, ఏసీపీలు, ఈఈలు, ఎస్ఎస్‌లు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

ముస్లింలకు రాజకీయంగా, సామాజికంగా ప్రాధాన్యం

మేయర్ కావటి



అధికారులతో కలసి మ్యాపులను పరిశీలిస్తున్న మేయర్ కావటి

నెహ్రూనగర్: రాష్ట్ర ప్రభుత్వం ముస్లింలకు రాజకీయంగా, సామాజికంగా అధిక ప్రాధాన్యత ఇస్తోందని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు పేర్కొన్నారు. సేవా కార్యక్రమాల నిర్వహణ నిమిత్తం మజ్లీస్ ఉలామా జమైత్ ఉలామా ఆర్గనైజేషన్‌కు స్థలం కేటాయించడానికి గానూ నగరంలోని బీఆర్ స్టేడియం తూర్పు వైపు గల ఖాళీ స్థలాన్ని, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వద్ద గల రెడ్ ట్యాంక్ పడమర వైపు గల ఖాళీ స్థలాన్ని నగర పాలక సంస్థ అధికారులు, ముస్లిం మత పెద్దలతో కలసి మేయర్ పరిశీలించారు. తొలుతగా ఖాళీ స్థలాల మ్యాప్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మజ్లీస్ ఉలామా జమైత్ ఉలామా ఆర్గనైజేషన్ సభ్యులు, ముస్లిం మత పెద్దలు కొన్ని రోజుల కిందట తనను కలసి పేద ముస్లిం విద్యార్థులకు అందిస్తున్న సేవల గురించి వివరించారన్నారు. శాశ్వత భవనాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, నగరపాలక సంస్థ ఖాళీ స్థలాన్ని కేటాయించాలని వినతి పత్రం సమర్పించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో బీఆర్ స్టేడియం తూర్పు గల ఖాళీ స్థలాన్ని, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ రెడ్ ట్యాంక్ పడమర వైపు గల ఖాళీ స్థలాన్ని పరిశీలించినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ అనుమతికి లెటర్ రాస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గులాం రసూల్, కార్పొరేటర్ షేక్ మీరావలి, పార్టీ నేత షేక్ నూరి ఫాతిమా, నగరపాలక సంస్థ సిటీప్లానర్ ప్రదీప్ కుమార్, ముస్లిం మత పెద్దలు ముఫ్తి అబ్దుల్ బాసీద్, ముఫ్తీ ఆసిఫ్, అబ్దుల్ గఫార్, హఫీజ్ అబ్దుల్ ఖాదీర్, ముఫ్తీ అబ్దుల్ కవి, మౌలానా ఇస్మాయిల్, ముఫ్తి రహమతుల్లా, అధికారులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో కీలకపాత్ర పోషించాలి

కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి



ఫ్యాన్లు అందిస్తున్న కెనరా బ్యాంక్ సిబ్బంది

గుంటూరు వెస్ట్: సామాజిక సేవలో కార్పొరేట్ సెక్టార్ కీలక భూమిక పోషించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి తెలిపారు. సామాజిక సేవలో భాగంగా ప్రభుత్వ హాస్టల్స్‌లో అమర్చేందుకు గానూ 100 సీలింగ్ ఫ్యాన్లను కెనరా బ్యాంక్ అధికారులు కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, డీఆర్వో చంద్రశేఖరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సామాజిక సేవలో కార్పొరేట్ వ్యవస్థ అందిస్తున్న సహకారం మరువలేమని, ఇది మరింత విస్తరిస్తే ఎంతో మందికి లబ్ధి చేకూరుతుందని అభిప్రాయపడ్డారు. ఇప్పటికే పలువురు క్రీడాకారులకు చేయూతతో పాటు సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి పనులు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వానికి సాయాన్ని అందించాలనుకునే వారు నేరుగా తనను గానీ, అధికారులను గానీ సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ వెంకట శివరామిరెడ్డి, డెప్యూటీ కలెక్టర్ లలిత, కెనరా బ్యాంక్ ఆర్ఎం శ్రీనివాస్ కణ్ణన్, చీఫ్ మేనేజర్ శ్యామ్ సుందర్, ఎల్‌డీఎం రత్న మహీపాల్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

జేకేసీ కళాశాలను సందర్శించిన నాక్ బృందం



ఎన్‌సీసీ కేడెట్ల గౌరవ వందనాన్ని స్వీకరిస్తున్న నాక్ బృందం

గుంటూరు ఎడ్యుకేషన్: జేకేసీ కళాశాలను సోమవారం నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (నాక్) ప్రతినిధుల బృందం సందర్శించింది. కళాశాలలో విద్యాబోధన, మౌలిక వసతులు, విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలు తదితర అంశాల్ని పరిగణలోకి తీసుకుని నాక్ గ్రేడ్ కోసం సిఫార్సు చేయనున్నారు. నాక్ ప్రతినిధులు డాక్టర్ అమితాబ్ సక్సేనా, డాక్టర్ అనూప్ కుమార్ దే, డాక్టర్ సుందరరామన్‌కు కళాశాల ఎన్‌సీసీ కేడెట్లు స్వాగతం పలికారు. అనంతరం వారు పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు, యాజమాన్యంతో వేర్వేరుగా సమావేశమయ్యారు. నాక్ ప్రతినిధుల బృంద పరిశీలన మంగళవారం కొనసాగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ. నాగేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఐక్యూఏసీ సమన్వయకర్త పి. గోపీచంద్, పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్ఆర్‌కే ప్రసాద్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలోనూ రాణించి జిల్లాకు పేరు తేవాలి



ఫెన్సింగ్‌లో పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న చీఫ్ కోచ్ వెంకటేశ్వరరావు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో ఈ నెల 13న జరిగిన రాష్ట్రస్థాయి అండర్–20 ఫెన్సింగ్ పోటీల్లో జిల్లాకు చెందిన జట్టుకు కాంస్యం, వ్యక్తిగత విభాగాల్లో సువర్ణ రాజు రజతం, ఆకురాతి లీలా వెంకటేష్, ఎస్కే ఫిరోజ్ ఆలీ, వల్లెపు పుష్పాంజలి కాంస్య పతకాలు సాధించారు. వీరిని సోమవారం స్థానిక బీఆర్ స్టేడియంలో డీఎస్ఏ చీఫ్ కోచ్ జి.వెంకటేశ్వరరావు అభినందించారు. ఆయన మాట్లాడుతూ నిత్యం క్రీడా సాధనతో పాటు పోటీల్లో కూడా పాల్గొనాలని సూచించారు. జాతీయ పోటీల్లో పతకాలు సాధించి జిల్లాకు పేరుతేవాలని ఆకాంక్షించారు. పతకాలు సాధించిన వారంతా గుజరాత్‌లో త్వరలో జరగనున్న జాతీయ పోటీలకు ఎంపికయ్యారని జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డి.అశోక్ బాబు తెలిపారు.

బ్లడ్ గ్రూప్ మ్యాచ్ కాకపోయినా కిడ్నీ మార్పిడి ఆపరేషన్

గుంటూరు వేదాంత హాస్పిటల్స్‌లో అరుదైన శస్త్ర చికిత్స



సాయికుమార్‌తో డాక్టర్ చింతా రామకృష్ణ, డాక్టర్ చారి

గుంటూరు మెడికల్: వైద్య రంగంలో వచ్చిన ఆధునిక సాంకేతికతో బ్లడ్ గ్రూప్ మ్యాచ్ కాకపోయినా కిడ్నీ మార్పిడి ఆపరేషన్ విజయవంతంగా చేసినట్టు గుంటూరు వేదాంత హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ , ప్రముఖ కిడ్నీ మార్పిడి వైద్య నిపుణులు డాక్టర్ చింతా రామకృష్ణ చెప్పారు. సోమవారం గుంటూరులోని హాస్పిటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆపరేషన్ వివరాలు వెల్లడించారు. గుంటూరు జిల్లా కొల్లిపర మండలం చక్రాయపాలెం గ్రామానికి చెందిన 27 ఏళ్ల చందు సాయికుమార్ ఏడాదిన్నరగా కిడ్నీ ఫెయిల్యూర్‌తో డయాలసిస్ చికిత్స పొందుతున్నాడు. ఈ సమయంలో కొడుకుకు తల్లి దుర్గ కిడ్నీ దానం చేసేందుకు ముందుకొచ్చింది. అయితే, కొడుకు బ్లడ్ గ్రూప్ ఓ పాజిటివ్ కాగా, తల్లి బ్లడ్ గ్రూప్ బీ పాజిటివ్. దీంతో పలు ఆస్పత్రుల్లో కిడ్నీ వైద్యులు మిస్ మ్యాచ్ బ్లడ్ గ్రూప్‌కు కిడ్నీ మార్పిడి ఆపరేషన్ చేయడం కుదరదని చేతులెత్తేశారు. చివరకు జులైలో తమ వద్దకు రాగా అత్యాధునిక వైద్య పద్ధతిలో ఇమ్యూనో ఎగ్జాషన్ ప్రొసీజర్‌లో యాంటీ బాడీస్‌ను రిమూవ్ చేశామని డాక్టర్ చింతా రామకృష్ణ చెప్పారు. జులై 28న ఏబీఓ ఇన్‌కంపాటబుల్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ విజయవంతంగా చేసినట్టు వివరించారు. ఆపరేషన్ ప్రక్రియలో డాక్టర్ కె.ఎస్.ఎన్. చారి, డాక్టర్ సురేష్, డాక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నట్టు వెల్లడించారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

పెదకాకాని: ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఉప్పలపాడు గ్రామంలో చోటు చేసుకుంది. మండలంలోని ఉప్పలపాడు గ్రామానికి చెందిన పెద్దిపాగ జోసఫ్ తంబి గుంటూరులోని వాటర్ సర్వీసింగ్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి భార్య సుశీల, ముగ్గురు సంతానం కలరు. కొంతకాలంగా జోసఫ్ చెడు వ్యసనాలకు బానిసగా మారాడు. అతిగా మద్యం సేవించడంతో పాటు పాన్ పరాగ్‌లు నిత్యం నములుతూనే ఉండేవాడు. దీంతో అప్పుడప్పుడు తట్టుకోలేని విపరీతమైన కడుపునొప్పి వస్తూ ఉండేది. ఆదివారం రాత్రి కడుపునొప్పితో జోసఫ్ బాధ పడుతూ ఉండగా భార్య సమీపంలో నివాసం ఉంటున్న అతని తండ్రి డేవిడ్‌కు తెలియజేసి, ఆసుపత్రికి తీసుకువెళ్లేందుకు వారి ఇంటికి వెళ్లింది. తిరిగి వచ్చే సరికి జోసఫ్ తంబి(38) ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించాడు. స్థానికుల సహకారంతో కిందకు దింపి, ఆసుపత్రికి తీసుకెళ్తుండగా.. మార్గమధ్యంలోనే మృతి చెందాడు. మృతుని తండ్రి డేవిడ్‌రాజు ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పెదకాకాని సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.

ఘనంగా చరక మహర్షి జయంతి



పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ పద్మావతి కల్యాణ మండపం వేదికగా భాస్కర్ ఆయుర్వేద హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆయుర్వేద వైద్య పితామహుడు చరక మహర్షి జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. సభకు డాక్టర్ గోకవరపు వెంకట కుమార్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య, కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, బొల్లేపల్లి సత్యనారాయణ పాల్గొని ప్రసంగించారు. అనంతరం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆస్పత్రి డాక్టర్ జి.వై.ఎస్. భాస్కర్, డాక్టర్ జి.లక్ష్మి శ్రీవాణి రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు.

రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపనలు



నగరంపాలెం: డివిజన్ పరిధిలోని వడ్డెరగూడెం ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు 18వ డివిజన్ కార్పొరేటర్ నిమ్మల వెంకటరమణ తెలిపారు. ఒకటి, రెండు వీధులతో పాటు బొడ్డురాయి సెంటర్ నుంచి వాటర్ ప్లాంటు వరకు రూ.50 లక్షలతో చేపట్టనున్న రోడ్ల నిర్మాణానికి సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు, స్థానిక పెద్దలు ఎర్రబాబు, బత్తుల శ్రీనివాసరావు, షేక్ అబ్దుల్లా, తిరుమలశెట్టి కుమార్, రామకృష్ణ పాల్గొన్నారు.

బాలికను వేధిస్తున్న యువకుడిపై కేసు నమోదు

చేబ్రోలు: మైనర్ బాలికను ప్రేమ పేరుతో మోసగించి, వేధింపులకు గురిచేస్తున్న యువకుడిపై పొన్నూరు పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పట్టణానికి చెందిన బాలికను జడవల్లి గ్రామానికి చెందిన యువకుడు మిక్కిలి రాఘవేంద్ర ప్రేమ పేరుతో అనేకసార్లు బలవంతంగా లైంగిక వేధింపులకు గురిచేశాడు. విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు రాఘవేంద్రపై అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ హసీమ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

డాక్టర్ భవనం హనుమ శ్రీనివాసరెడ్డికి రామన్ అవార్డు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ భవనం హనుమ శ్రీనివాసరెడ్డి

గుంటూరు మెడికల్: అత్యంత అరుదైన, క్లిష్టమైన, అవేక్ సర్జరీలు చేస్తూ బాహుబలి సర్జన్‌గా గుర్తింపు తెచ్చుకున్న గుంటూరు బ్రింద హాస్పిటల్‌కు చెందిన సీనియర్ న్యూరో సర్జన్ డాక్టర్ భవనం హనుమ శ్రీనివాసరెడ్డికి అత్యంత ప్రతిష్టాత్మకమైన డాక్టర్ సి.వి.రామన్ అవార్డు లభించింది. విజయవాడ కేఎల్ యూనివర్సిటీలో సోమవారం ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్‌ను ఉపయోగించి న్యూరాలజీ సమస్యలను త్వరగా కనుగొనే బయోమార్కర్స్ అనే అంశంపై సదస్సు ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరుగనున్న ఈ సదస్సులో ప్రపంచవ్యాప్తంగా బ్రెయిన్‌పై పరిశోధనలు చేస్తున్న ఏడుగురికి డాక్టర్ రామన్ అవార్డుల్ని కేఎల్ యూనివర్సిటీ అందజేసింది. ఇందులో గుంటూరుకు చెందిన డాక్టర్ భవనం హనుమ శ్రీనివాసరెడ్డి ఒకరు. మంగళవారం ఆయన న్యూరో నావిగేషన్ – ఇంజినీరింగ్ టూ మెడిసిన్ అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించి మాట్లాడనున్నారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన డాక్టర్ సి.వి.రామన్ అవార్డు అందుకున్న డాక్టర్ హనుమ శ్రీనివాసరెడ్డికి బ్రింద హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ వసంత సాయికృష్ణప్రసాద్, సిద్ధార్థ, రేడియాలజిస్ట్ డాక్టర్ జమ్ముల అనిత, డాక్టర్ అనిల్, డాక్టర్ నాగరాజు అభినందనలు తెలిపారు.

విద్యార్థులంతా వ్యవస్థాపక నైపుణ్యాల్ని పెంచుకోవాలి



మాట్లాడుతున్న పృథ్వీరాజ్

గుంటూరు ఎడ్యుకేషన్ :విద్యార్థులంతా వ్యవస్థాపక నైపుణ్యాల్ని పెంచుకోవాలని భారత్ అభియాన్ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ కాకాని పృథ్వీరాజ్ సూచించారు. సోమవారం ప్రపంచ వ్యవస్థాపకత దినోత్సవం సందర్భంగా అమరావతి రోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో స్వావలంబ భారత్ అభియాన్ సంయుక్త ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పృథ్వీరాజ్ మాట్లాడుతూ పురాతన కాలంలో ప్రతి ఒక్కరూ ఒక వ్యవస్థాపకుడిగా ఉండేవారని తెలిపారు. పాత్రల తయారీ, వ్యవసాయం, పట్టు, చేనేత పరిశ్రమలకు ఉన్న ఆదరణను గురించి వివరించారు. ఆ రోజుల్లో చేనేత కార్మికులు అగ్గిపెట్టెలో పట్టేంత పట్టు చీరలను తయారు చేసేవారని తెలిపారు. నాటి కార్మికుల నైపుణ్యాల్ని ప్రస్తుత తరం విద్యార్థులు ఉపయోగించుకోవాలని సూచించారు. వెలగపూడి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు కృష్ణకుమారి మాట్లాడుతూ జూట్ బ్యాగులను వినియోగదారుల అవసరాల మేరకు తయారు చేస్తున్నామని, వాటిని వివిధ కార్యక్రమాల్లో రిటర్న్ గిఫ్టులుగా వినియోగిస్తున్నారని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ మాట్లాడుతూ ప్రతి సెమిస్టర్‌లో ముగ్గురేసి విద్యార్థుల్ని ఉద్యోగం పొందేస్థాయి నుంచి ఉద్యోగాన్ని కల్పించే వ్యక్తిగా మార్చే ప్రయత్నంలో కళాశాల సృజన విభాగం ద్వారా వివిధ రకాలైన కార్యకలాపాల్ని చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో సృజన విభాగ డైరెక్టర్ డి. కల్యాణి, ఎంబీఏ విభాగాధిపతి వి. చక్రవర్తి, ఆచార్యలు డాక్టర్ కె. లలిత, సహాయాచార్యులు సీహెచ్. వైష్ణవి, సీహెచ్. వేదవతి, ఏ. బాజీబాబు, వి. అభిలాష్, బి. అనిత, ఎంబీఏ, ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు పాల్గొన్నారు.

వీనులవిందుగా సినీ సంగీత విభావరి



వెంకట్రావును సత్కరిస్తున్న మిరియాల ప్రసాదరావు, చందు సాంబశివరావు

పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో భారతీ సాంస్కృతిక సంగీత కళావేదిక వ్యవస్థాపకుడు మిరియాల ప్రసాదరావు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకుల్ని అలరించింది. సినీ నటుడు చిరంజీవి జన్మదినం పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించారు. చిరంజీవి నటించిన చిత్రాల్లోని పాటల్ని గాయకులు ప్రసాదరావు, శెట్టి థామస్, పి.శ్రీనివాసరావు, పి.మోహన్, సీహెచ్.వాసు, బి.శ్రీనివాసరావు, ఎస్.సత్యనారాయణ, బి.నరేష్, రత్నం, జబి ఆలపించారు. సభకు చిరంజీవి యువత జాతీయ అధ్యక్షుడు మేకల రవీంద్రబాబు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కాపునాడు జోన్–3 అధ్యక్షుడు బొందలపాటి వెంకట్రావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో చందు సాంబశివరావు, డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, సేవా సదన్ వ్యవస్థాపకుడు మిరియాల గోపీకుమార్ పాల్గొన్నారు.

'కళ్లం'లో జాతీయస్థాయి సాంకేతిక సదస్సు వాల్ పోస్టర్ల విడుదల

గుంటూరు రూరల్: విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకుని ఉన్నతంగా రాణించాలని కళ్లం ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం ఉమా శంకర్‌రెడ్డి తెలిపారు. చౌడవరం గ్రామంలోని కళాశాలలో సోమవారం సెప్టెంబర్ 15, 16 తేదీల్లో నిర్వహించనున్న జాతీయ స్థాయి విద్యార్థుల సాంకేతిక సదస్సు గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ మాట్లాడుతూ సంకల్ప్ 2024 పేరుతో జాతీయ స్థాయిలో సాంకేతిక సదస్సును నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి ఈ సదస్సుకు వేలాదిగా ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ విద్యార్థులు పాల్గొంటారన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి మాట్లాడుతూ ఈ సదస్సులో సాంకేతిక, మేనేజ్‌మెంట్, క్రీడలు తదితర విభాగాల్లో పోటీలు నిర్వహిస్తారన్నారు. ప్రాజెక్ట్ ఎక్స్‌పో, క్విజ్, హాకతాన్, కోడ్ సిఫర్, పేపర్ ప్రజంటేషన్, ట్రజరర్ హంట్, క్రిడల్లో క్రికెట్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, త్రోబాల్, టెన్నిస్, క్యారమ్స్, చెస్ పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు రూ.4 లక్షలకు పైగా ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నామని వెల్లడించారు. సదస్సు కన్వీనర్‌గా డాక్టర్ జేవీకే రత్నం, కో–కన్వీనర్‌గా డాక్టర్ వెంకటరావు, డాక్టర్ పి.రత్నబాబు, డాక్టర్ సీహెచ్ శ్యామలాదేవి వ్యవహరిస్తారని తెలిపారు.